ప్రజాశక్తి

మంగళవారం 27 డిసెంబరు 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

రాజధాని కార్మికులను కొనసాగించాలి

సిఆర్‌డిఎ కమిషనర్‌కు ఎంఎల్‌సి లక్ష్మణరావు, సిపిఎం నేత బాబూరావు వినతి

సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు, కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి

ప్రజాశక్తి - విజయవాడ : రాజధాని పారిశుధ్య కార్మికులను జనవరి నుండి పనిలో కొనసాగించాలని, వారికి పని భద్రత కల్పించాలని, ఉద్యోగులనే పేరుతో తొలగించిన రాజధాని సామాజిక పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌కు పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని సిఆర్‌డిఎ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ వివేక్ యాదవ్‌ను కలిసి విజ్ఞాపనపత్రం అందించారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ టెండరు కాలం డిసెంబర్‌నాటికి ముగియనున్న నేపథ్యంలో కొత్తగా టెండరు పిలిచి రాజధానిలోని 29 గ్రామాల్లో 2017 నుండి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను జనవరి నుండి యధావిధిగా కొనసాగించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికులను పని నుండి నిలుపుదల చేస్తే వారి ఉపాధి పోయి నిరుపేదలైన వారి కుటుంబాలు రోడ్డుపాలవుతాయని పేర్కొన్నారు. రాజధాని గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంటుందని తెలిపారు. ప్రభుత్వం నుండి నిధులు వచ్చేలా కషి చేసి కార్మికులకు పని భద్రత కల్పించాలని విన్నవించారు. కార్మికుల పోరాట ఫలితంగా అధికారులు హామీ ఇచ్చిన విధంగా డిసెంబర్ 23 నాటికి రాజధాని పారిశుధ్య కార్మికుల జీతాలు మొత్తం చెల్లించినందుకు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సిఆర్‌డిఎ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేరళ మంత్రి రాజేష్‌కు స్వాగతం

కేరళ మంత్రి ఎం.బి.రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ

ప్రజాశక్తి - గన్నవరం : కేరళ ప్రభుత్వ స్థానిక స్వపరిపాలన, ఎక్సైజ్ శాఖ మంత్రి ఎం.బి.రాజేష్‌కు సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. స్వాతంత్ర్య సమరయోధులు, గొప్ప సిద్ధాంత కర్త మాకినేని బసవపున్నయ్య 108వ జయంతి సందర్భంగా విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో 'రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఇక్కడికి వచ్చారు. మంత్రి ఎం.బి.రాజేష్‌కు ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకష్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విజయవాడ వెళ్లారు.

త్వరగా ఐకానిక్ పార్క్ నిర్మాణం

అధికారులకు విఎంసి కమిషనర్ ఆదేశం

వార్త 6వ పేజీలో

అజిత్ ప్రాణ త్యాగానికి గర్విస్తున్నాం

శౌర్యచక్ర లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సతీమణి శకుంతల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎన్‌సిసి ఏడో బెటాలియన్ విజయవాడ వారు సోమవారం నగరంలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో దాసాగా ఆఫ్ బ్రేవ్ హార్ట్ డాక్యుమెంటరీ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శౌర్య చక్ర లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ మందకర్ భార్య శకుంతల మందకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శకుంతల మందకర్ ఎన్‌సిసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ దాసాగా ఆఫ్ బ్రేవ్ హార్ట్ బుక్‌ను రాసేటప్పుడు చాలా బాధకు లోనయ్యాయనని, అయితే తమ పిల్లలు నాన్న గురించి మనం ఎందుకు సమాజానికి తెలపకూడదని వెన్నుతట్టారని గుర్తుచేసుకున్నారు. ఈ నేపథ్యంలో సమాజం కోసం అజిత్ చేసిన ప్రాణ త్యాగానికి తాము గర్విస్తున్నామని పేర్కొన్నారు. యూనిఫారం ఒంటిపై వేసుకుని దేశ రక్షకులుగా మన ఊరు, దేశం బాగుండాలని ఆకాంక్షిస్తూ అందుకోసం పడే శ్రమను గుర్తుచేసుకుంటే ఒళ్లంతా పులకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి గ్రూప్ కమాండెంట్ కల్నల్ ఎ.కె.రీషిన్ (కాకినాడ) పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులతో శకుంతల

భూ సర్వే మరింత వేగవంతం

సర్వేయర్లకు కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం

సర్వేయర్లకు కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ : భూముల రీ సర్వే ప్రక్రియకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామ సర్వేయర్లకు ప్రాథమిక సౌకర్యాల ఉపకరణాల కిట్లను కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డిప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ సర్వేయర్లకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 245 మంది గ్రామ సర్వేలకు క్షేత్రస్థాయిలో భూముల రీ సర్వేకు రూ.2,900 విలువైన ప్రాథమిక ఉపకరణాల కిట్లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. వీటిలో సర్వేయర్‌కు ఉపయోగపడే లీగల్, ఏ ఫోర్ పేపర్లు, క్యాలిక్యులేటర్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, ఫోల్డర్లు స్టాంప్యాడ్, పంచింగ్ మిషన్లు, గమ్ బాటిల్స్, ఫైల్ కవర్లు వంటివి ఉంటాయన్నారు. త్వరలో సర్వేయర్లకు మెడికల్ కిట్స్ కూడా పంపిణీ చేయనున్నామన్నారు. జిల్లాకు వారం రోజుల్లో రెండు డ్రోన్లు రానున్నాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్షా పథకంలో భాగంగా భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 14 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామని, భూ యజమానులకు భూ హక్కు పత్రాల పంపిణీ తుది దశకు చేరిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్దేశించిన 2023 డిసెంబర్ నాటికి రీ సర్వే ప్రక్రియ జిల్లాలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత, జిల్లా సర్వే అధికారి కె.సూర్యారావు పాల్గొన్నారు.

ఎపి రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల పాఠశాలకు

నున్నలో భూమి కేటాయింపు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్

మండలంలోని నున్నలో ఎపి రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల పాఠశాల ఏర్పాటు కానుంది. ప్రస్తుతం విజయవాడలోని భవానీపురం ఐరన్ యార్డులోని అద్దె భవనంలో ఉన్న ఆ పాఠశాలకు నున్నలో స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్ఎస్ నంబర్ 370/1, 370/3 లో 3.50 ఎకరాలను కేటాయించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ ఢిల్లీరావు ఆదేశాలు జారీ చేశారు. 2003లో మైనార్టీ బాలికల కోసం విజయవాడలో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. తొలుత విద్యాధరపురంలోని ఆర్‌టిసి శిక్షణ కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఐరన్ యార్డులోని అద్దె భవనంలో నడుస్తోంది. ఈ పాఠశాలలో సుమారు 200 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈనేపథ్యంలో మైనార్టీ బాలికల పాఠశాలకు శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణం చేపట్టేందుకు స్థలం కేటాయించాలని ఎపి రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శి ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.ఢిల్లీరావుకు ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ ఢిల్లీరావు విశాఖ జిల్లా సింహాచలంలోని ఎపి రెసిడెన్షియల్ స్కూల్ పూర్వ విద్యార్థి కూడా కావడంతో విజయవాడ నగర సమీపంలోని గ్రామాల్లో స్థలాన్వేషణ చేశారు. ఆ క్రమంలో విజయవాడ రూరల్ మండలం నున్నలో 2006లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్ఎస్ నంబర్ 370/1, 370/3లో సుమారు ఐదెకరాల భూమిని రెవెన్యూశాఖ సేకరించింది. అయితే ప్రస్తుతం ఆ భూమి ఖాళీగా ఉండటంతో, ఎపి రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల పాఠశాలకు కేటాయించాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఆ మేరకు నున్నలో 3.50 ఎకరాల స్థలాన్ని పాఠశాలకు కేటాయించేందుకు విజయవాడ రూరల్ మండల తహాశీల్దార్ బి.సాయి శ్రీనివాస్ నాయక్ సుముఖతను వ్యక్తం చేశారు. మొత్తం ఐదెకరాలలో 3.50 ఎకరాలు మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌కు, మరో 50 సెంట్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించారు. ప్రస్తుతం ఎపి రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల పాఠశాల నడుస్తున్న భవనానికి నెలకు సుమారు రూ.2 లక్షల అద్దెను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో స్థలం కేటాయిస్తే, వెంటనే శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సిద్ధంగా ఉంది.

నున్నలో కేటాయించిన స్థలం

హ్యాండ్‌వాష్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: యూనిసెఫ్ వారి సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ ఆఫీజున్నీసా సోమవారం ప్రారంభించారు. మెప్మా కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆఫీజున్నీసా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే కుటుంబసభ్యులు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం సుజాత, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ మునిహర పాల్గొన్నారు.

పిల్లలమర్రి వర్ధంతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ మొట్టమొదటి ఎమ్మెల్యే పిల్లలమర్రి వెంకటేశ్వర్లు 22వ వర్ధంతిని సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా పిల్లలమర్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆంధ్ర రాష్ట్రం కలిసివున్న నాటి నుండి నాలుగు సార్లు జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత పిల్లలమర్రికే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంబోజి శివాజి, జూనెబోయిన శ్రీనివాసరావు, మాశెట్టి రమేష్‌బాబు, మహమ్మద్ అసదుల్లా, నీలకంఠం శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-మైలవరం: విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జి కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వి.నర్సిరెడ్డి విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై ఇటీవల ప్రజాశక్తిలో పాఠశాలలో లైంగిక వేధింపులు పేరుతో వార్తా కథనం వెలువడింది. పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో నందిగామ ఉప విద్యాశాఖ అధికారి అందించిన నివేదిక ప్రకారం నర్సిరెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. నర్సిరెడ్డిని జి కొండూరు పోలీసులు అరెస్టు చేసి మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచుగా వచ్చే నెల ఆరు వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నూజివీడు సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి-తిరువూరు: మండలంలోని లక్ష్మీపురం పాలకేంద్రం వద్ద అదుపు తప్పి జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. సేకరించిన వివరాలు ప్రకారం మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన పంతంగి మురళీ (47) తిరువూరు నుంచి ఇంటికి వెళుతుండగా పాల కేంద్రం వద్ద అదుపు తప్పిన బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మురళీకి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదాలపై ఉక్కుపాదం : ఎసిపి

ప్రజాశక్తి-తిరువూరు: కోడి పందాలు, పేకాట, ఇతర జూదాలపై ఉక్కుపాదం మోపినట్లు, ఎసిపి మారగాని రమేష్ పేర్కొన్నారు. తిరువూరు పోలీస్ స్టేషన్ లో సోమవారం ఆయన సిఐ భీమారాజు, ఎస్ఐ దుర్గాప్రసాద్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహిం చారు. ఇప్పటికే డివిజన్‌లో పోలీసుల కన్ను కప్పి నిర్వహిస్తున్న జూదాలపై దాడులు చేసి నిర్వాహకులను, జూదర్లను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. జూదాలు నిర్వహించే పాత వాళ్లను, కోడి కత్తులు తయారీదారులను అదుపులోకి తీసుకుని బైడోవర్ చేస్తున్నామని తెలిపారు. జూదాలను అరికట్టేందుకు తీస్తుకుంటున్న చర్యలకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎఎస్ పి విజ్ఞప్తి చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ: పట్టణంలోని కోర్ట్ ఆవరణంలో ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ (ఐఎఎల్) నూతన సంవత్సర కేలండర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెగంటి జీవరత్నం సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్స్ వై.బాబురావు, ఎం.నారాయణరావు, ఎన్.ప్రసాద్, బి.మల్లికార్జునరావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు నివాళి



వన్‌టౌన్‌లో...

ప్రజాశక్తి-భవానీపురం: బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగారావు అని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మోహన రంగా 34వ వర్ధంతి సందర్భంగా 44 డివిజన్ చెరువు సెంటర్‌లో గొంది ప్రసాద్ అండ్ ఫ్రెండ్స్, మైలవరపు రత్నకుమారి దుర్గారావు ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, వైసీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, మైలవరపు కష్ణ, అత్తలూరి పెద్దబాబు, వీరంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. 44వ డివిజన్ వంగవీటి మోహన్ రంగా జంక్షన్ దగ్గర ఉన్న ఎస్వీ రంగారావు కాపు తెలగ బలిజ ఒంటరి ఐక్య సంఘం కార్యాలయం వద్ద రంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు పత్తి నాగేశ్వరావు, జనరల్ సెక్రెటరీ లింగం శివప్రసాద్, కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీ, యలకుల చలపతిరావు, తిరుపతి అనూష సురేష్, సంపద చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. 51వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు భక్తుల వెంకటేష్, పోతిన శివ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి

నందిగామలో...

కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ పాల్గొని 750 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర కాపు సంఘం అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లోని రంగా రంగా విగ్రహానికి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, వైసిపి నాయకులు కాలవ వాసుదేవరావు, కాలవ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. **ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక వైసిపి కార్యాలయంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గన్నెపూడి వెంకట్రావు, పట్టణ అధ్యక్షులు పాల నారాయణరెడ్డి, జడ్పిటిసి స్వర్ణాల తిరుపతిరావు, మైలవరం ఉపసర్పంచ్ సిహెచ్ సీతారాంరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగులూరి ఆజాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వీరులపాడు:** పెద్దాపురం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి రంగాకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, గ్రామ ఉప సర్పంచి బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆవుల ప్రసాద్, మాజీ అధ్యక్షులు కోటేరు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** అనాసాగరంలో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక గాంధీ సెంటర్‌లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తాటి శివకృష్ణ, తొర్లికొండ సీతారామయ్య, కామిసెట్టి వెంకటేశ్వరరావు, కంచి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని కోదాడ రోడ్డులో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిట్టిప్రోతుల సత్యనారాయణ, గోగిశేట్టి మహేష్, కామిశెట్టి అమర్నాథ్, గద్దం శేషగిరిరావు, పసుపులేటి సత్య శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గౌరవరం గ్రామ కాపు సంఘం అధ్యక్షులు మేణ్ణి రాము ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ బాలసైదా, జగ్గయ్యపేట మండల రైతు కన్వీనర్ అన్నాబత్తుల శ్రీనివాసరావు, గ్రామ మాజీ సొసైటీ అధ్యక్షులు గంగూరి సాంబశివరావు, గ్రామ వైసీపీ అధ్యక్షులు బూతుకూరి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ:** రాఘవయ్యపార్కు వద్ద మాజీ ఎంఎల్ఎ వంగవీటి రాధా సోమవారం రంగా



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాధా

విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కృష్ణలంక, సెంట్రల్ నియోజకవర్గంలోని రామలింగేశ్వర్‌నగర్ 15వ డివిజన్ స్క్రూబ్రిడ్జీ సెంటర్‌లో రంగా విగ్రహానికి మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లిరావు నేతృత్వంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేద ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప నాయకులు వంగవీటి మోహన రంగా అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమాలలో ఆయన పాల్గొని రంగాకు నివాళు లర్పించారు. హాజరయ్యారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** నవాబుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ సుబ్రమణ్యం, స్థానిక వైసీపీ నాయకుడు గింజుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** కొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో జనసేన మైలవరం నియోజకవర్గ ఇంచార్జి అక్కల గాంధీ, కాపు నాయకులు అడపా శివ, దేవబత్తుల నాగబాబు, నాగభూషణం, మున్సిపల్ కౌన్సిలర్లు కరిమికొండ శ్రీలక్ష్మి, అడపా వెంకయ్య నాయుడు, గుంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** కూనపరాజుపర్వ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వంగవీటి రంగా అభిమానులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. రెడ్డికుంట గ్రామంలో రాధా-రంగ మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల సూర్య కిరణ్ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. తాడిగూడెంలో జరిగిన కార్యక్రమంలో సామాజిక వేత్త బర్మా ఫణిబాబు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, తాడి చిట్టిబాబు, తాడి ఉమ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ విష్ణు

జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సభలో రామకృష్ణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: జగన్ పాలనలో ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి శూన్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం వన్‌టౌన్ కొత్తపేటలో సభ జరిగింది. సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావటం లేదన్నారు. ఉన్న పరిశ్రమలను కూడా ఇబ్బందులకు గురిచేస్తుండటంతో పక్క రాష్ట్రమైన తెలంగాణాకు తరలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇక్కడ చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవన్నారు. ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చారని తెలిపారు. మద్యం, ఇసుక, మైనింగ్‌ల ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయలను దోచుకుని, దాచుకుంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికలలో ఓటుకు రూ.5 వేలు ఇచ్చేందుకు కూడా జగన్ సిద్ధంగా వున్నట్లు కనబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, నాయకులు పల్లా సూర్యారావు, కొరగంజి దుర్గాంబ, చీపుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** సిపిఐ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డిపో సెంటర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను

సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచిపెట్టారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజి శివాజి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శులు మాశెట్టి రమేష్‌బాబు, మహమ్మద్ అసాదుల్లా, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, సీనియర్ నాయకులు బోగ్యం నాగులు, భాను, జయరాజు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** తిరువూరులోని సిపిఐ కార్యాలయం వద్ద, పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఉన్న పా ర్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, నాయకులు ఎస్.కె.సుభాని, ఉదయ్, మస్తాన్, ముత్తయ్య, అశోక్, వెంకటేశ్వరరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జెవివి వైజ్ఞానిక తరగతులు

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: యువతలో శాస్త్రీయ దక్పథం పెంచే విధంగా జెవివి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. కొండపల్లిలోని స్థానిక క్రాంతి హైస్కూల్లో జరిగిన ఈ తరగతుల్లో జెవివి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాహుల్, మరళీధర్ మాట్లాడుతూ నేటి యువతలో నైపుణ్యాలు అనేకం ఉన్నాయని, వాటిని మెరుగుదిద్దుకుంటే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు వాటి తీవ్రత తగ్గించే మార్గాలు సూచించారు. ఆధునిక కాలంలో ముఖ్యంగా యువత మూఢనమ్మకాల బారిన పడి నష్టపోతుందని, మూఢనమ్మకాలే వారి అభివృద్ధికి ఆటంకం అన్నారు. అనంతరం జెవివి నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తులు, మహేందర్ రెడ్డి, జిహెచ్పి వర్మ, రాజశేఖర్, దేవేంద్ర పాల్గొన్నారు.

జెవివి కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

లింగ వివక్షకు తావులేకుండా

చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తాం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

లింగ వివక్షత లేకుండా జిల్లాలో అన్ని స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం స్కానింగ్ పరీక్షల నివేదికలు సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జి.గీతాబాయి అన్నారు. పీసీ అండ్ పీఎన్ టీ 1994 (లింగ నిర్ధారిత పరీక్షల నిరోధం) చట్టం అమలుకు జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం సోమవారం డిఎంఅండ్ హెచ్ అధ్యక్షతన డిఎంఅండ్ హెచ్ ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిఎంఅండ్ హెచ్ ఓ మాట్లాడుతూ పీసీ అండ్ పీఎన్ టీ 1994 (లింగ నిర్ధారిత పరీక్షల నిరోధం) చట్టం కఠినంగా అమలు చేయడం ద్వారా లింగ నిర్ధారిత, ఆడ శిశువు భ్రూణ హత్యల నిరోధం లక్ష్యాన్ని సాధించే దిశగా ఎంతో ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. దీని ప్రకారం ఏ లేబరేటరీ గాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో ఎటువంటి పరీక్షలను జరిపేందుకు వీలుండదన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి 3 సం.లు జైలు శిక్ష మరియు జరిమానా కూడా విధించబడుతుందన్నారు. అబార్షన్ను ప్రోత్సహించ కూడదని, ఎక్కడైనా జరిగితే అందుకు కారణాలు సమగ్ర సమాచారం సేకరించి, అవసరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. స్కానింగ్ కేంద్రాలు తనిఖీలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని వైద్యాధికారులకు సూచిం చారు. జిల్లా విభజన అనంతరం కష్ణాజిల్లాలో 72 ప్రైవేట్, 9 ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు నమోదై ఉన్నట్లు తెలిపారు. కొత్త స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ కోసం 7 దరఖాస్తులు, రెన్యువల్స్ కోసం 5 దరఖాస్తులు, మార్పుల కోసం 2 దరఖాస్తులు వచ్చాయని వీటిని క్షుణ్ణంగా పరిశీలించి కమిటీ ఆమోదించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డిఐఓ డా.శర్మిష్ట, గైనకాలజిస్ట్ డా.ఎన్. లీలాప్రియదర్శిని, రేడియాలజిస్ట్ డా. వినీల్, డిస్ట్రిక్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివి. వరదరాజులు, ఎన్జిఓ ప్రతినిధులు కొరెడ్ల సుశీల, పి. వెంకటేశ్వరరావు, డెమో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంఅండ్ హెచ్ డాక్టర్ జి.గీతాబాయి

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-గన్నవరం

నిరుపేద కుటుంబాల్లో విద్యా కుసుమాలు వెల్లి విరియడం ద్వారానే సామాజిక మార్పు సంకల్పిస్తుందని నమ్మిన వ్యక్తి ఎమ్మెల్యే వంశీ అని ఎంపీపీ అనగాని రవి అన్నారు. గన్నవరం ఇస్లాంపేటకు చెందిన భానుసోఫియా అనే డెంటల్ విద్యార్థిని చదువుకు ఎమ్మెల్యే వంశీ సహాయంగా అందించిన 50 వేల రూపాయలను సోమవారం పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించి విద్యా దానం చేస్తున్న విద్యా దాత అని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం జడ్పిటిసి ఎలిజిబెత్ రాణి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు ఎస్ కె ఎం ఎం ఏ కలాం, పార్టీ నాయకులు సర్నాల ఆంజనేయులు, ఎం వి ఆర్ పాల్గొన్నారు.

సోఫియా కు నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కొండలమ్మ అమ్మవారి 2023 నూతన సంవత్సర క్యాలెండర్ను గుడివాడ నియోజకవర్గ శాసనసభ్యులు కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు నాని సోమవారం ఆయన కార్యాలయం వద్ద ఆవిష్కరించినట్లు ఆలయ కార్యానిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలిటి చంటి, వడ్లమన్నాడు వైఎస్ఆర్సీపి నాయకులు శేషం గోపి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో సోమవారం లైన్ యలమంచి గోపీచంద్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సహకారంతో వందమంది నిరుపేద వృద్ధులకు అన్నదాన అక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఫణి గోపాల్ , గుత్తికొండ బోస్, వైసీపీ ప్రసాద్, పి రవికుమార్, సుబ్బారావుచౌదరి, రామకష్ణ, సిహెచ్ రాజా పాల్గొన్నారు.

డిఎల్పిఓ కార్యాలయం ఏర్పాటుకు వినతి

స్పందనలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ కేంద్రమైన ఉయ్యూరు పట్టణంలో డీఎల్పీవో కార్యాలయ ఏర్పాటు చేయడంలో అధికారుల అలసత్వంపై సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఓ ప్రకట నలో తెలిపారు. ఉయ్యూరు కేంద్రంగా రెవిన్యూడివిజన్ ఏర్పడి డివిజన్ కార్యాలయం ప్రారంభించినప్పటికి మంజూరైన డీఎల్పీవో కార్యాలయం ఏర్పాటు చేయకుండా ఇన్చార్జ డీఎల్పీవో దుర్గాప్రసాద్ కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారన్నారు. ఈవిషయమై ఉయ్యూరులో డీఎ ల్పీవో కార్యాలయం ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికి రెండు నెలలు గడిచినా ఇన్ఛార్జ్ డీఎల్పీవో స్పందించక పోవడం పై మరలా ఫిర్యాదుచేయగా వెంటనే కార్యాలయం మార్చాలని డీపీవోను ఆదేశించినట్టు తెలిపారు.

కొడాలి అరాచకాలను సహించం

టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : గుడివాడలో కొడాలి నాని అరాచకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని బెదిరింపులకు తగ్గేది లేదని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు జోలికొస్తే తాట తీస్తామని తెలుగుదేశం పార్టీ కష్ణా జిల్లా అధ్యక్షులు మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణరావు సోమవారం తీవ్ర హెచ్చరిక చేశారు. ఆదివారం గుడి వాడలో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆయన స్పందిస్తూ వైసిపి ఆగడాలకు గుడివాడ కేరాఫ్ అడ్రస్ గా మారిందన్నారు. గుడివాడ నియోజికవర్గానికి చెందిన గెడ్డం గ్యాంగ్, గుడివాడ నియోజకవర్గ ఇంచార్జి రావి వెంకటేశ్వరరావు కు ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక అయనను కుట్రపూరితంగా హత మార్చాలని ఖాళీ అనే కుర్రాడితో ఫోన్ కాల్స్ చేయించి బెదిరించడాన్ని అలాగే పెట్రోల్ పోసి చంపాలని ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ రాష్టం లో జగన్రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిన దగ్గర నుండి లా అండ్ ఆర్డర్ సరిగ్గా లేధని ముఖ్యంగా గుడివాడ నియోజకవర్గం శాసనసభ్యులు కొడాలి నాని అరాచకాలు మరియు అతని గ్యాంగ్ ధౌర్జన్యాలకి అడ్డు ..అదుపు లేకుండా పోయిందన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తూ ఉండటాన్ని తప్పు పట్టారు.ఇది పోలీసు వ్యవస్థకే సిగ్గు చేటన్నారు. గుడివాడ నియోజకవర్గ ఇంఛార్జి రావి వెంకటేశ్వరరావుకు ఏమైనా జరిగితే దాని పూర్తి బాధ్యత ఈ పోలీసు వారిది, జగన్రెడ్డి ప్రభుత్వానిదే అని నారాయణరావు హెచ్చరించారు. రావి వెంకటేశ్వరరావు కు ఎవరైతే బెదిరింపు కాల్స్ చేసాడో అలాగే ఆయన మీద పెట్రోల్ పోసి చంపాలని దాడికి యత్నించిన ఖాళీ అనే కుర్రాడ్ని అతణ్ణి వెనకున్న వారంధరిని అరెస్ట్ చేసి తగిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

సాకేత్ (ఫైల్)

ప్రజాశక్తి-ఘంటసాల : గత శనివారం శ్రీకాకుళం-కొడాలి మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు సోమవారం మృతి చెందాడు. సేకరించిన వివరాల మేరకు శ్రీకాకుళం గ్రామ పంచాయతీ శివారు సూరపనేనివారిపాలెం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సుబ్బారావు కుమారుడు సాకేత్ శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం బైక్ ప్రమాదంలో యువకుడు గాయపడగా, తొలుత చల్లపల్లిలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. వైద్యుల సూచనలు మేరకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందు సోమవారం మృతిచెందాడు. సాకేత్ మతి చెందడంతో తల్లిదండ్రులతోపాటు బంధుమిత్రులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు.

ఫిలిప్ మృతికి పలువురు సంతాపం

ప్రజాశక్తి-చల్లపల్లి : టాప్ రిక్షా కార్మిక యూనియన్ ఉపాధ్యక్షుడు రాచూరి ఫిలిప్ (58) సోమవారం గుండెపోటుతో పాగోలలో మృతిచెందారు. ఫిలిప్ చల్లపల్లి మండల టాప్ రిక్షా యూనియన్ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఫిలిప్పు మరణ వార్త తెలుసుకున్న చల్లపల్లి మండల సిపిఎం కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు, మండల సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, సీనియర్ నాయకులు వెనిగళ్ళ వసంతరావు ఫిలిప్పు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు



ఉచితంగా పూజా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం పెద్ద ఎత్తున భక్తులు వెంకటేశ్వర స్వామి వ్రతాలు నిర్వహించారు. ఫౌండర్ ట్రస్టీ కాకాని బాబు అరుణ దంపతులు వ్రతంలో కూర్చున్న భక్తులకు పూజ సామాగ్రిని స్వయంగా అందజేశారు. అలాగే జనవరి ఆరవ తారీఖున వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతములు జరుగుతాయని కాకాని అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తవ్వా పూర్ణచంద్రరావు, దేవాలయ అర్చకులు చక్రవధానుల సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని చాగంటి పాడు గ్రామంలో పీస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వద్ధ మహిళలకు చీరలు, బాలబాలికలకు నూతన వస్త్రాలు సోమవారం పంపిణీ చేశారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్క రించుకొని పీస్ సేవా సంస్థ డైరెక్టర్ గుడివాడ నిరంజని, ప్రశాంత్ లు, జాషువాలు దుస్తులతోపాటు కానుకలను అందించారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు చట్టాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని అమరావతి లీగల్ అకాడమీ డైరెక్టర్ అవిర్నేని శ్రీనివాసశ్యామ్‌సుందర్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో 'వినియోగదారుల హక్కులు' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన అవిర్నేని శ్రీనివాస శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ వినియోగదారులకు భారతదేశంలో అనేక చట్టాలు రక్షణగా ఉన్నాయన్నారు. అయితే వాటిపై సరైన అవగాహన లేకపోవటంతో

మాట్లాడుతున్న అవిర్నేని శ్రీనివాస శ్యామ్ సుందర్

వినియోగదారులు చాలా మంది మోసపోతున్నారని వివరించారు. కేవలం వస్తువుల కొనుగోలు మాత్రమే కాకుండా సేవల విషయంలోనూ అనేక చట్టాలు ఉన్నాయన్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి కన్స్యూమర్ ఫోరమ్స్ పని చేస్తున్నాయన్నారు. ఆయా విలువలను బట్టి ఆయా స్థాయిల్లో వీటిపై చర్చ జరిగి వినియోగదారులకు న్యాయం జరిగే విధంగా ఫోరమ్‌లు కృషి చేస్తాయన్నారు. ప్రధానంగా వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, వాణిజ్య శాఖాధిపతి డాక్టర్ ఆంజనేయశాస్త్రి, క్లబ్ కన్వీనర్ గోపాలకృష్ణ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: పిఎసిఎస్ ద్వారా 32 మంది రైతులకు రూ.1.80 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులు సోమవారం రైతులకు అందజేశారు. సొసైటీ అవరణలో సంఘం అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మీ ప్రసాదు, సూపర్వైజర్ గోపాలకృష్ణ, సంఘం కార్యదర్శి నారాయణరెడ్డి సమక్షంలో రైతులకు ఈ చెక్కులు అందజేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వార రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వత్సవాయి: తాళ్లూరు గ్రామంలో వత్సవాయి లక్ష్మణరావు ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడి కుడి చేయి ఫ్రాక్చర్ అయింది. చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ షేక్ సొంధ్ మియా, వత్సవాయి రాంబాబు, షేక్ జానీ, బోల్లా వెంకటసాయి పాల్గొన్నారు.

ఎంఇఒగా చిట్టిబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వీరులపాడు: మండల విద్యాశాఖాధికారిగా చిట్టిబాబు బాధ్యతలు స్వీకరించారు. కంచికచర్ల మండల విద్యాశాఖ అధికారిగా ప్రస్తుతం ఆయన పని చేస్తున్నారు. ఆయన వీరులపాడు మండల విద్యాశాఖ బాధ్యతలు తీసుకోవడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. మండలంలో నాడు నేడు అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని పలువురు కోరారు.

మెరిట్ విద్యార్థికి నగదు బహుమతి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: విద్యార్థికి సెల్ఫ్ కంట్రోల్ - కాన్ఫిడెన్స్- మోటివేషన్ చాలా అవసరం అనే గురువులు నేర్పిన మాటల ఆచరణ మన ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని 'రాధా - రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్టు' మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల సూర్యకిరణ్ అన్నారు. రెడ్డిగూడెం గీతాంజలి హైస్కూల్‌కు చెందిన నరేంద్ర గతేడాది పదోతరగతిలో 578 మార్కులు సాధించినందుకు రూ.10 వేలు నగదు బహుమతిని సూర్యకిరణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడాలి నానికి ఆ అర్హత లేదు : బుద్దా

ప్రజాశక్తి-వన్‌టౌన్: వంగవీటి మోహన రంగా పేరు ఎత్తే అర్హత మాజీ మంత్రి కొడాలి నానికి లేదని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్ బుద్దా వెంకన్న నిప్పులు చెరిగారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెంకన్న మాట్లాడుతు గుడివాడలో కొడాలి నానికి ఓటమి ఖాయమని తెలిపోయిందని అందుకే రౌడీ మూకలతో టిడిపి నేతలపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. గుడివాడలో వంగవీటి మోహనరంగా వర్ధంతి చేయవద్దని చెప్పడానికి నాని ఎవరని ప్రశ్నించారు. రంగా అన్ని వర్గాల గుండెల్లో నిలిచిన వ్యక్తి అని అన్నారు. కొడాలి నాని, ఆయన అనుచరులకు రంగా పేరు ఎత్తే అర్హత లేదన్నారు. క్రిస్మస్ వేడుకలు పెడితే నాని దగ్గరకు పట్టుమని పది మంది కూడా రాలేదన్నారు. కాపులు, బిసిలు, దళితులు, కమ్మ అందరూ నానిని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. అచ్చోసిన ఆంబోతులా తిరగడమే నానికి తెలుసని, పౌరసరఫరాల శాఖ మంత్రిగా పేదల బియ్యం బొక్కాడని విమర్శించారు. 2019లో రాధాకు జగన్ సీటు ఇవ్వకపోతే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తున్న వేళ మళ్లీ రాధా, రంగా జపం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, కామా దేవరాజు, కొట్టేటి హనుమంతరావు, పేరం సత్యనారాయణ, ఈగల సాంబ, రాజగిరి అశోక్, జగదీష్, చీపిళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ చిల్డ్రన్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఓబిహెచ్‌ఎ డివిజన్ బడ్జెట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవారం కొత్తపేటలోని కెబిఎన్ కాలేజీలో ఉపాధ్యాయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ లయన్ డా రాజు డేవిడ్ దొంతులూరి సభకు అధ్యక్షత వహించారు. ఫ్యాకల్టీగా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, భౌతిక శాస్త్ర నిపుణులు యర్రంరెడ్డి గాంధీ చైల్డ్ సైకాలజీ మరియు భౌతిక శాస్త్రం మీద తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ అందచేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా గౌరవ అధ్యక్షులు దేవినేని కిషోర్ కుమార్, విశిష్ట అతిథిగా కెబియన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పిఎల్.రమేష్ ,గౌరవ అతిథిగా సెంట్రల్ కమిటీ అధ్యక్షులు చెన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ శిక్షణా తరగతుల చైర్మన్ ఆర్.బ్రహ్మారెడ్డి, కార్యదర్శి బికె.శిరీష కుమారి, కోశాధికారి ఎస్‌కె. ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ

నందిగామలో ఎస్ఆర్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన జైయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, కొలంబస్, బౌన్సర్, చిన్న పిల్లలు తిరిగే ఆట వస్తువులను పరిశీలించారు. అనంతరం ఎగ్జిబిషన్ చూసేందుకు వచ్చిన పలువురితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు శివ నాగేశ్వరరావు, లింగాలపాడు నాయకులు శ్రీనివాసరావు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు వీరబాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రావూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మూఢనమ్మకాల నిర్మూలనకై నిర్విరామంగా కృషి చేసిన నిరాడంబరుడు రావూరి అర్జునరావు అని పలువురు కొనియాడారు. రావూరి అర్జునరావు ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. సోమవారం ఉదయం నుండి సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని నాస్తిక కేంద్రంలో ఉంచారు. సాయంత్రం నాలుగు గంటలకు కృష్ణలంకలోని విద్యుత్ దహనవాటికలోని అంత్యక్రియలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా కెక్టర్ ఎస్.డిల్లీరావు, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో పాటు

నగరంలోని వైద్యులు, లాయర్లు, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం సభ్యులు, వయో వృద్ధుల సభ్యులు పలు రంగాల ప్రముఖులు అనేక మంది సందర్శించి నివాళులర్పించారు.

దుర్గగుడి హుండీల ఆదాయం రూ.2.76 కోట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్

ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం మహామండపం ఆరవ అంతస్తులో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. 14 రోజులకు సంబంధించి నగదు రూ.2,76,15,707లు, బంగారం 395 గ్రాములు, వెండి 17.283 కిలలు యాత్రికులు సమర్పించారు. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా రూ.8,078 విరాళంగా సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ తెలిపారు.

బ్రాహ్మణ కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నందిగామ: ఇటీవల మరణించిన నందిగామ బ్రాహ్మణ బంధువు వేదాంతం రామకృష్ణ కుటుంబాన్ని ఎన్ఎస్ఆర్ చారిటబుల్ సొసైటీ నందిగామ అధ్యక్షులు ప్రకాష్ నందిరాజు , గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నందిగామ అధ్యక్షులు వెలది సుగుణశేఖర రావు, దుర్భాకుల సావిత్రిదేవి, కొమరగిరి వాచస్పతి, సన్నిధానం హనుమత్ కిషోర్ శర్మ తదితరులు పరామర్శించారు. అనంతరం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు లక్ష్మీనరసింహశాస్త్రి, ఉదయలక్ష్మి, స్వబ్బసీను ఫణికుమార్, దేసికన్ మాస్టారు, దుర్భాకుల ఆంజనేయప్రసాద్, లాయర్ రంగా పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు పట్టణంలోని డాంగే నగర్‌లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు వివరించారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, సామినేని మనోహర్, పేరం సైదేశ్వరరావు, గుంజ నరసయ్య, మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా ఉంటాం : లెనిన్‌బాబు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గుణదలలోని అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్ అండ్ హోమ్ కేర్ నర్సింగ్ సర్వీసెస్‌ను ఆరవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.లెనిన్‌బాబు సోమవారం సందర్శించారు. ఎటువంటి సమస్య వచ్చినా తమను సంప్రదించవచ్చని వద్దులకు లెనిన్‌బాబు భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు రాంబాబు ఆధ్వర్యంలో వద్దులను సంరక్షించడమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. వద్దులకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే తమను సంప్రదించవచ్చని వారు కోరారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ సాల్మన్ జయకుమార్ మాట్లాడుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా

అమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్ ను సందర్శించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.సుధీర్ కుమార్, న్యాయవాదులు కె.శివయ్య, ఎమ్.ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-గంపలగూడెం

మండలంలోని గొల్లపూడి గ్రామానికి చెందిన మోదుకు ఉమ (27) ఆదివారం రాత్రి తన ఇంటిలో ఉరేసుకుని మృతిచెందినట్లు గంపలగూడెం ఎస్సై వి సతీష్ కుమార్ తెలిపారు. తన భర్త నిత్యం తాగి తిరుగుతూ ఇంటి అవసరాలకు ఆర్థిక సహాయం అందించకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి పేరా బత్తుల గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేయాలి

● 'స్పందన'లో కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించుటకు వివిధ శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ స్పందన నిర్వహించి, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో భాగంగా అనీమియా నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈనెల 27వ తేదీన మంగళవారం జిల్లాలో వివిధ పథకాల కింద కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు 70 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనలో భాగంగా అనీమియా నివారణా చర్యలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఇందుకోసం గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికల్లో అనీమియా బాధితులను గుర్తించి. వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచే విధంగా ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఐరన్ సిరప్ వంటి వాటిని అందించి, ప్రతి నెల వారిలో హెచ్చి శాతం మెరుగుదల నమోదు చేస్తూ అనీమియా ట్రాకింగ్ నివేదిక సమర్పించాలన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జెసి తదితరులు

30 న జిల్లాలో గ్రామదర్శిని : ఈనెల 30వ తేదీ శుక్రవారం జిల్లాలో గ్రామదర్శిని నిర్వహిస్తున్నట్లు, అధికారులు సిద్ధం కావాలన్నారు. జిల్లాలో గత రెండు విడతల్లో జరిగిన గ్రామదర్శినిలో మొత్తం 3,183 గుర్తించిన సమస్యలలో ఇప్పటి వరకు 566 పరిష్కరించినట్లు, వివిధ శాఖల అధికారుల వద్ద 1415, మండల ప్రత్యేక అధికారుల వద్ద 1185 పెండింగ్ ఉన్నా యని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి కషి చేయాలన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి : ఈనెల 29, 30 తేదీలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు వివిధ శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 29వ తేదీన సా.6.45 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకొని విజయవాడ వెళతారని, 30వ తేది మ.12.15 గం.లకు గన్నవరం నుండి హైదరాబాదు వెళతారన్నారు.

వైద్యాధికారులను సత్కరించిన కలెక్టర్ : ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో ఉత్తమ సేవలు అందించిన ఐదుగురు ది వైద్యాధి కారులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. నవంబర్ 21 నుండి డిసెంబర్ 20 వరకు వీరు ఉత్తమ సేవలకు ఎంపికైయ్యారని, ప్రతి నెల ఈ విధంగా 5 మంది వైద్యాధికారులను గుర్తిం చనున్నట్లు డిఎంఅండ్ హెచ్ ఓ డా.జి.గీతాబాయి తెలిపారు. స్పందన కార్యక్రమంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడా వీసీ శివనారాయణ రెడ్డి, సిపి ఓ వై. శ్రీలత, డిఎస్ ఓ వి.పార్వతి, డిఆర్డిఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి కే సరస్వతి సివిల్ సప్లై జిల్లా మేనేజర్ డాక్టర్ ఏ.శ్రీధర్, జడ్పీ ఇన్చార్జి సీఈవో జి శ్రీనివాసరావు, డిఎల్డిఓ జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : తనను అక్రమంగా విధుల నుంచి తొలగించారని, కొనసాగించాలని మధ్యాహ్న భోజన కార్మికురాలు స్పందనలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలసి వినతిపత్రం అందజేశారు. తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజన్సీలో వంట పని చేస్తున్న తనను అక్రమంగా విధులు నుండి తొలగించారని తిరిగి తనను విధుల్లోకి తీసుకొని తమ కుటుంబానికి న్యాయం చేయాలని శ్రీకాకుళపు సరళ వినతిపత్రం అందించారు.

ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెనమలూరు

క్రిస్మస్ సందర్భంగా తాడిగడపలోని కార్మికనగర్ 1, 2లలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ యువజన సంఘం, ఐద్వా మహిళా సంఘం, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆటల పోటీలను నిర్వహిం చారు. లెమన్ స్పూన్, రన్నింగ్ రేస్, స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా సంఘాల నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, పుసులూరి పాతాళలక్ష్మి, తరిగొప్పు లావణ్య, అన్నవరపు శ్రీనివాసరావుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీసం సోమశేఖర్, సిహెచ్ రాంబాబు, పుసులూరి సత్యనారాయణ, వీసం రమణమ్మ, నరసయ్య, చిప్పా విశ్వేశ్వరి, దాసరి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4 , టెక్నికల్ ఉద్యోగాల మెరిట్ జాబితా విడుదల

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది మార్చి 29 న వెలువరించిన వికలాంగుల జిల్లా స్థాయి ఉద్యోగ ప్రకటననుసరించి దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల వివరాలను పరిశీలించి, క్లాస్-4, గ్రూపు - 4, టెక్నికల్ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను అంతర్జాలంలో పొందుపరిచినట్లు విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ సహాయ సంచాలకులు బి. రామ్ కుమార్ తెలిపారు. ఈ www.krishna.ap.gov.in వెబ్ సైట్లో అందుబాటులో ఉంచడమైనదన్నారు. అభ్యర్థులు ఈ జాబితా పై ఏమైన అభ్యంతరం ఉన్నచో రాతపూర్వకముగా జిల్లా కలెక్టర్, కృష్ణాజిల్లా వారికి లేదా సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, కృష్ణాజిల్లా వారికి వచ్చే నెల అనగా జనవరి 2 తేది లోగా పోస్టు ద్వారా మాత్రమే అందజేయాలన్నారు.

సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

భారత కమ్యూనిస్టు పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం స్థానిక రుస్తుం బదా లోని సిపిఐ కార్యాలయంలో కీర్తిశేషులు శ్రీహరి రావు భవనంలో బందరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా సహాయ కార్యదర్శి టి తాతయ్య హాజరై జండా ఆవిష్కరణ చేశారు . మున్సిపల్ కార్మిక నాయకులు కరపాటి సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఒడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

రైతులు, కౌలు రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బికెల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు బివి శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం తోలిన ఏడు రోజుల్లో రైతులకు డబ్బు అందించాలని, ఆర్‌బికె కేంద్రాల్లోని తేమ శాతాన్ని నిర్ణయించి ధాన్యానికి మద్దతు ధర క్వింటాకు 2840 రూపాయలు కేరళలో మాదిరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్బికే అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంగం మండల ఉపాధ్యక్షులు మాదాసు సుబ్బయ్య,గ్రామ నాయకులు కాంచర్లపల్లి శేషు, అవాల సాయిబాబు, అగ్ని హోత్రం బావన్నారాయణ, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మాదాసు మురళి తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మారెడ్డి'లో చార్లెస్ బాబేజ్ జయంతి

ప్రజాశక్తి-బంటుమిల్లి

ఫాదర్ ఆఫ్ కంప్యూటర్ చార్లస్ బాబేజ్ జయంతిని కొమ్మారెడ్డి పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ పాల్గొని కంప్యూటర్ వల్ల విజ్ఞానం, వైద్య, వ్యవసాయ మొదలైన రంగాలలో వచ్చిన మార్పులను గురించి వివరించారు. ప్రపంచాన్ని అభివృద్ధి వైపు తీసుకువెల్తున్న ఈ కంప్యూటర్ ఆవశ్యకతను కంప్యూటర్ బోధకులు శ్రామపద్మ పావని , పాషా ఎస్ ఎస్ ఎన్ శేఖర్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుడివాడ వెళ్లడానికి ప్రభుత్వ అనుమతి ఎందుకు ? : కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

తెలుగుదేశం పార్టీ నాయకుడు రావి వెంకటేశ్వరరావును కలిసేందుకు కూడా పోలీస్ అనుమతి తీసుకోవాలా అని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పోలీసుల తీరుపై మండిపడ్డారు. సోమవారం రంగ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కొల్లు రవీంద్రను పోలీసులు అరెస్ట్ చేసి తన నివాసానికి తరలించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రావి వెంకటేశ్వర రావును బెదిరిస్తుందని మమ్మలని బయటకు వెళ్ళకుండా అడ్డుకుంటుందన్నారు. అసలు వైసీపీ ప్రభుత్వ ఉద్దేశం ఏంటో చెప్పాలన్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామ లేక పాకిస్తాన్ లో ఉన్నామా అర్థం కావడం లేదన్నారు.రంగా వర్ధంతి లో పాల్గొనేందుకు కూడా నాకు స్వాతంత్ర్యం లేదా అని ప్రశ్నించారు. పోలీసులు అనుక్షణం తనను ఎందుకు వెంబడిస్తున్నారో చెప్పాలన్నారు.

కొల్లు రవీంద్రను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

పారదర్శకంగా ఆశాల నియామకానికి వినతి

వినతిపత్రం అందిస్తున్న ఆశాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : సిఫార్సులకు అతీతంగా పారదర్శకంగా ఆశాల నియామకాలు చేపట్టాలని కోరుతూ కృష్ణాజిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి కుమారి, పి.ధనశ్రీలు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. గీతాబాయికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కాలంలో జిల్లాలో ఖాళీగా ఉన్న 116, ఆశ వర్కర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ప్రకటన జారీ చేశారని, ఈ పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. శానిటేషన్ కమిటీ తీర్మానాల ద్వారా కాకుండా డైరెక్టర్ ప్రభుత్వ ఆధీనంలోనే రిక్రూట్మెంట్ జరిగేల చర్యలు చేపట్టాలన్నారు. 60 సంవత్సరాల నిండి రిటైర్డ్ అయిన ఆశ వర్కర్ల స్థానంలో, అలాగే చనిపోయిన ఆశ వర్కర్ల స్థానంలో వారి కుటుంబాల్లో అర్హులైన వారికి ఈ పోస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ ఎం, నిబంధనల ప్రకారం 1000,1200 పాపులేషన్‌కి రూరల్లో 2000,2500 పాపులేషన్ ఆధారంగా.మెరిట్ ఆధారంగా పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘ ఉపాధ్యక్షురాలు స్వరూప, కోశాధికారి కిరణ్ మై ,సరోజినీ తదితరులు ఉన్నారు.

త్వరగా ఐకానిక్ పార్క్ నిర్మాణం : విఎంసి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను, ఐకానిక్ పార్కులో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్సెల్ ప్లాంట్‌కు ప్రతినిత్యం వచ్చే కొబ్బరిబొండాలు, చెట్ల కొమ్మలను క్రష్‌చేసి ప్రాసెస్ చేసేందుకుగాను ప్రత్యేకంగా రెండు షెడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాంట్లో కొంతమేర అభివృద్ధి పరచిన రోడ్డును పరిశీలించి వాంబే కాలనీ శ్మశాన వాటికల వైపు గల గేటు వరకు రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో జరుగుతున్న ఐకానిక్ పార్కు పనులను పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణ పనులను, పార్కు ఆవరణలో చేపట్టిన ప్లాంటేషన్ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈపర్యటనలో అదనపు కమీషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, ఎగ్గిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ రావు, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో 16 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి, వారి సమస్యల వివరాలు అడిగి తెలుసుకున్నారున. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుని సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నగరపాలక సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల అర్జీదారుల సంతప్తే లక్ష్యంగా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందనలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 6 అర్జీలు, పట్టణ ప్రణాళిక విభాగం 5, యుసిడి 3, పబ్లిక్ హెల్త్ విభాగం 1, అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ హార్టికల్చర్ 1 అర్జీ వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వైసిపి : దేవినేని ఉమా

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అసమర్థతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. గొల్లపూడిలోని మౌలానగర్‌లో సోమవారం ఇదేం ఖర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాజయం తప్పదన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు నర్రా వాసు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం నిత్యం ప్రవహించే నది : సరికొండ నరసింహరాజు

ప్రజాశక్తి - విజయవాడ : కవిత్వం నిత్యం ప్రవహించే నది లాంటిదని ప్రముఖ కవి సరికొండ నరసింహరాజు అన్నారు. ఆయన ప్రచురించిన 'లఘురూప' కవిత్వ సంపుటి ఆవిష్కరణ సోమవారం విజయటాకీస్ వద్ద ఉన్న 'అనేక' బుక్ స్టాల్‌లో జరిగింది. ఈసందర్భంగా సరికొండ మాట్లాడుతూ "కవిత ప్రారంభమే కాదు...ముగింపు కూడా గొప్పగా ఉండాలి...నేను రాస్తున్న కవిత ఇంకా పరిపూర్ణం కాలేదు...నా ఆచరణా పాదాలే...నా కవితకు ముగింపు పాదాలు ..." అని తన పుస్తకంలోని ఒక లఘు కవితను వినిపించారు. శిఖా ఆకాష్ మాట్లాడుతూ సమాజానికి అవసరమైన ఎన్నో విలువైన అక్షరాలను కవి ఈ పుస్తకంలో పొందుపరిచారని పేర్కొన్నారు. ప్రముఖ కవి అరసవిల్లి కష్ణ మాట్లాడుతూ 'కవిత్వం ఎప్పుడూ చదివిన విస్ఫోటనమై పేలాలి..కవిత్వం చదివేవారిలో ఆలోచన రేకెత్తించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, విమర్శకులు దాసరి సుబ్రహ్మణ్యం, అమూల్యచందు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి : స్పందనలో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : స్పందన అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డిప్యూటీ కలెక్టర్ వి.జ్యోతి సురేఖ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలకు నిర్ణీత గడువులోగా సంబంధిత శాఖల అధికారులు పరిష్కారం చూపాలన్నారు. కొందరు అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించకుండా పరిష్కారంలో అలసత్వం చూపడం వల్ల కొన్ని అర్జీలు రీ ఓపెన్ అవుతున్నాయని పేర్కొన్నారు. అటువంటి అర్జీలు రీ ఓపెన్ కాకుండా ప్రాథమిక స్థాయిలోనే అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కరిస్తే అర్జీ దారుడు సంతప్తి చెందుతారన్నారు. అర్జీలను స్థానికంగానే పరిష్కరించినట్లైతే జిల్లా స్థాయి వరకు వచ్చే అవసరం ఉండదన్నారు.

రేపు 'ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం'పై రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి - విజయవాడ : ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించి పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని రాఘవయ్య పార్కు వద్ద గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలోని బాలోత్సవ భవన్‌లో రాష్ట్రస్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తెలిపారు. పదేళ్లపాటు దళిత, గిరిజన, ప్రజాసంఘాలు, కెవిపిఎస్ ఆధ్వర్యాన జరిగిన ఉద్యమ ఫలితంగా ఉమ్మడి ఆంధ్ర పదేశ్‌లో ఈ చట్టాన్ని తీసుకువచ్చారని ఆయన గుర్తుచేశారు. ఆ చట్టం నియమ నిబంధనలను అనుసరించి సెక్షన్ 4 ప్రకారం పదేళ్లపాటు పనిచేస్తుందని, 2023 మార్చితో గడువు తీరిపోతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం కొనసాగించేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

టిడ్కో గృహాల పంపిణీ ఎప్పుడో ?

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

టిడ్కో గృహాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సకాలంలో పూర్తి చేసి లబ్ధిదారులను వాటిని పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా డిసెంబరు 21న టిడ్కో ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ అనుకున్న సమయానికి పంపిణీ జరక్కపోవడంతో లబ్ధిదారులు నిరాశచెందారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 27,872 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటిలో ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో 6,576, జగ్గయ్యపేటలో 3,160, తిరువూరులో 240, నందిగామలో 1,536 ఇళ్లు నిర్మించారు. వీటిని ఎప్పుడు పంపిణీ చేస్తారో ప్రశ్నార్థకంగా మారింది.

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P.206/2022

Between:

బచ్చు శివ ...పిటీషనర్

And

కుండేటి రాజు అండ్ అదర్స్ ...రెస్పాండెంట్లు

R-1: కుండేటి రాజు, S/o.తాతారావు, వయస్సు 50 సం॥లు, హిందు, లక్ష్మీనగర్ కాలని, గుడివాడ టౌన్, మండలం, గుడివాడ, కృష్ణా జిల్లా.

పై నెంబరు గల MVOP పిటీషన్ నందు 1వ రెస్పాండెంట్ అయిన మీకు, శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా సదరు నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున, శ్రీకోర్టు వారు ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు ఆర్డరు వేసియున్నారు. కావున ది.09-01-2023 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైన తెల్పిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమున పిటీషను తీర్మానము జరుగును అని తెలియ జేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

CH.S.K.V.సూర్యప్రభ,
అడ్వకేట్, రాజమహేంద్రవరం.
సెల్: 9032441103

పెన్షన్ పాస్‌బుక్కు పోయినది.

కోడూరు మండలం, కోడూరు గ్రామంలోని వి.టి.కాలనీ వాసి షేక్ రహిమున్నీసా, భర్త (లేటు) ఆదామ్ సాహేబ్ కు చెందిన పెన్షన్ పుస్తకము పి.పిఓ నెం.2455 జి.పి పోయినది. ఈ నెల 1వ తేదిన ఫ్యామిలీ పెన్షన్ తీసుకొనేందుకు ఎస్.బి.ఐ.కి వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల దగ్గర పోలీస్ స్టేషన్‌లో అప్పగించగలరు. లేదా నా ఫోన్ నెంబర్ 9000022653 కు ఫోన్ చేసి చెప్పగలరు.

ఇట్లు
షేక్ రహిమున్నీసా,
భర్త.ఆదామ్ సహేబ్(లేటు)
విటికాలినీ-కోడూరు,
కోడూరు మండలం.

మహారాజ శ్రీ నందిగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.47/2021

Between:-

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నందిగామ బ్రాంచి తరపున చీఫ్ మేనేజర్ ....వాది

మరియు

భువనేశ్వరీ స్వయం సహాయక సంఘం, నందిగామ మరియు 7 మంది. ...ప్రతివాదులు.

భువనేశ్వరి స్వయం సహాయక సంఘం, నందిగామ తరపున లీడర్లు
1.తమ్మిశెట్టి నాంచారమ్మ, భర్త నరసింహారావు,
2.షేక్ ఖాదరభీ, భర్త మస్తాన్.
2.తమ్మిశెట్టి నాంచారమ్మ, భర్త నరసింహారావు, వయస్సు 33సం॥లు, డివిఆర్ కాలనీ, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టీఆర్ జిల్లా.
3.షేక్ ఖాధరభీ, భర్త మస్తాన్, వయస్సు 54 సం॥, డోర్ నెం.12-61, డి.వి.ఆర్ కాలనీ, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టీఆర్ జిల్లా.
5.కందెల మంగమ్మ, భర్త స్వామి, వయస్సు 49సం॥, డోర్ నెం.31-36, చెర్వుబజారు, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టీఆర్ జిల్లా.
6.షేక్ జాఫరున్నీసా, భర్త రెహమ్మాన్, వయస్సు 42 సం॥, డి.వి.ఆర్.కాలనీ, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టీఆర్ జిల్లా.
7.షేక్ గౌసియా, భర్త సైదా, వయస్సు 35 సం॥, డి.వి.ఆర్.కాలనీ, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టీఆర్ జిల్లా.
8.పుల్లెల సురేఖ, భర్త నాగేశ్వరరావు, వయస్సు 26 సం॥, డి.వి.ఆర్ కాలనీ, నందిగామ పట్టణం అండ్ మండలం, ఎన్టీఆర్ జిల్లా.

పై నెంబరు దావాలోని మొదటి ప్రతివాది సంఘం మరియు సంఘ సభ్యులు 10 మంది కలిసి వాది బ్యాంకు నుండి స్వయం సహాయక రుణమును పొంది, తిరిగి తీర్చుటలో విఫలమైనందున, సదరు మొత్తమును వడ్డీతో సహా తిరిగి రాబట్టు కొనుటకు వాది బ్యాంకు వారు పై నెంబరు దావాను దాఖలు చేయగా, పై ప్రతివాదులు హాజరు నిమిత్తం ది. 5-01-2023వ తేదీకి వాయిదా కలదు. కనుక పై ప్రతివాదులకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల పై తెలిపిన తేదీన ఉదయం గం.10.30.ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల పరోక్ష మందు తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి అనుమతిన//

వాయిదా తేది 5-1-2023.

దావా మొత్తం : రూ.5,72,564-00

కె.వి.సుబ్బారావు,
న్యాయవాది,
నందిగామ.

దావా సమన్లు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో : చీరాల

OS NO 302/2019

Between:

M/S VANPIC projects private Limited, Hyderabad తరుపు జనరల్ మేనేజర్ ...వాది

మరియు

1.పోతిన సత్యనారాయణరావు వగైరా ..... ప్రతివాదులు

To,
D1)
పోతిన సత్య నారాయణరావు
S/o లేటు పోతిన రాములు
డోర్ నెం : 40-3/1-40,
2 వ ఫ్లోర్, కె.వి. ఆర్ వీధి, నియర్ కాంధారి హొటల్, కృష్ణా నగర్, లబ్బీపేట,
విజయవాడ - 10

పై నెంబరు దావాని వాది కంపెని వారు **OSNO 145/2011** అను నెంబరు దావాలో పైకోర్టు వారు జారి చేసిన డిక్రీ మరియు జడ్జిమెంటని చెల్లని, నిరర్థకమైనదని, వాది కంపెనీని బద్దపరచ జాలదని డిక్లేర్ చేయమని మరియు 1వ ప్రతివాది అయిన నీపై ఈ నెంబరు దావా షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎటువంటి దస్తావేజులు సృష్టించ కుండా పర్మినెంట్ ఇంజెక్షన్ కోరుచు దాఖలు చేసి యున్నారు. ఇందు నిమిత్తమై నీకు అనేక సార్లు కోర్టువారు దావా సమన్లు జారీ చేసినప్పటికి ఉద్దేశ పూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయు చున్నందున కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు జారి చేయుటకు ఆదేశించి యున్నారు కావున ఇందు నిమిత్తమై నీకు ఏమైనా అభ్యంత రములు ఉన్నయెడల ది 29-12-2022న ఉదయం 10:30 నిమిషాలకు పై కోర్టు వారి యెదుట స్వయంగా కాని వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి యెదుట మనవి చేసుకోనవలెను. లేనిచో నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
బండారుపల్లి హేమంత కుమార్
బి.కామ్.బి.యల్. అడ్వకేట్ & నోటరీ
(కేంద్ర ప్రభుత్వం) చర్చ్ కాంపౌండ్ పేరాల,
చీరాల - 523157.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
ఆంధ్రా Andhra | కార్పొరేషన Corporation

తిరువూరు శాఖ
7-81, డి.యల్.యన్ టవర్స్, జయాభవి సెంటర్ రోడ్డు, తిరువూరు, కృష్ణాజిల్లా-521235, ఫోన్:9959797308.

ఇ.వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం ఆస్థుల అమ్మకపు ప్రకటన, స్థిరాస్తుల అమ్మకమునకు సంబంధించి సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 2002 యొక్క రూల్ 8(6) ప్రకారం.

ఇందు మూలముగా సాధారణ ప్రజానికానికి తెలియచేయునది ఏమనగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తిరువూరు శాఖ** కు తనఖా పెట్టినారు, ఈ క్రింది ఉదహరించిన ఆస్తిని ఆధికృత అధికారి అయిన దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారు స్వాధీనం చేసుకున్నారు, మీరు బ్యాంకుకు ది. **31-10-2018** తేది నాటికి బకాయి పడిన సొమ్ము రూ. **12,74,363/-** (అక్షరాల పన్నెండు లక్షల డెబ్బై నాలుగు వేల మూడు వందల అరవై మూడు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ, ఇతర ఖర్చులు తిరిగి చెల్లించనందున ది. **11-01-2023** తేది న అధికృత అధికారి అయిన దిగువ సంతకందారు ఇ-వేలం ద్వారా ఆస్తులను అమ్ముటకు నిర్ణయించడమైనది.**"ఎక్కడ ఏది ఉన్నదో అది" "ఎలా ఉన్నదో అలా " "అక్కడ ఏది ఉంటే అది"** అనే ప్రాతిపదికన అమ్మబడును.

ఋణగ్రహీత(లు) మరియు హామీదారుల పేర్లు మరియు చిరునామా: **1) శ్రీమతి కర్నాటి పుష్పలత,** భర్త: తాళ్ళూరి వెంకటేశ్వరరావు, **2) తాళ్ళూరి వెంకటేశ్వరరావు,** తండ్రి: రామయ్య, ప్లాట్ నెం.11, శ్రీనివాస అపార్ట్‌మెంట్స్, ప్రతిభ కాలేజ్ ప్రక్కన, తిరువూరు-521235.

ఇ-వేలం తేది. 11-01-2023,	**ధరావత్తు చెల్లించు ఆఖరి తేది. 10-01-2023**

స్థిరాస్తి వివరములు: కృష్ణాజిల్లా, తిరువూరు, శ్రీనివాస అపార్ట్‌మెంట్స్‌లో మొత్తం 388.60 చ॥గ॥లలో 29.89 చ॥గ॥లు లేదా 24.98 చ॥మీ॥లలో గల అవిభాజ్యపు వాటాలో 2వ అంతస్తులో 882 చ॥అ॥లలో (ఉమ్మడి ఏరియా మరియు బాల్కనితో కలిపి)గల ఫ్లాట్ నెం.11 శ్రీమతి కర్నాటి పుష్పలత (సేల్ డీడ్.నెం.2078/2016) గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** నగర పంచాయతి రోడ్డు, **దక్షిణం:** ఫ్లాట్ నెం.34, **పడమర:** ఫ్లాట్ నెం.55, **ఉత్తరం:** నగర పంచాయతి రోడ్డు, **ఫ్లాట్ నెం.11 హద్దులు: తూర్పు:** కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టూ స్కై, **పడమర:** ఓపెన్ టూ స్కై, **ఉత్తరం:** మెట్లు.

రిజర్వు ధర రూ.19,15,200/-	**ధరావత్తు ధర: రూ. 1,91,520/-**

అస్థి అమ్మకం యొక్క నియమ నిభంధనల కొరకు యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా వెబ్ సైట్ **www.unionbankofindia.co.in and https://www.ibapi.in** నందు చూడగలరు.

అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు అస్థి పరిశీలన కోసం అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు **ఫోన్: 9959797308,** బ్రాంచ్ మెయిల్ ఐడి: **tiruvur@unionbankofindia.com** నందు చూడగలరు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి
చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదిన ఇ-వేలం అమ్మకము నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీతలు మరియు హామీదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) క్రింద దీనిని నోటిసుగా పరిగణించవలెను.

తేది : 22-12-2022
ప్రదేశం : తిరువూరు

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రంగా సేవలు మరువలేనివి : కొల్లు

పామర్రులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కులమతాలకు అతీతంగా, పేదల పక్షాన పోరాటం చేసిన రంగ గారి జీవితం అందరికి ఆదర్శనీయం అని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. రంగా వర్ధంతి ని పురస్కరించుకుని స్థానిక రేవతి సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొనకల్ల బుల్లయ్య, తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** పంద్రాజు సాంబ శివరావు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు రంగా విగ్రహా లకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. సాయిన పుష్పవతి,షేక్ ముజాహిద్, వాసే మరళీ, కకారాల సురేష్, దేవరపల్లి కోటి, సుంకర గాంధీ, దారపురెడ్డి మనేశ్వరరావు పాల్గొన్నారు. వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబీ) ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. నాయకులు పైడిముక్కల వంశీ, మురళీ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలం ఆకులమన్నాడు గ్రామంలో సోమవారం స్వర్గీయ వంగవీటి మోహన రంగా 34 వర్ధంతిలో మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పాలఒగని వంగవీటి మోహన రంగా విగ్రహానికి భారీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గూడూరు మండల ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో వంగవీటి మోహన రంగా 34వ వర్ధంతి సందర్భంగా వంగవీటి మోహన్ రంగా అభిమానులు పార్టీలకు అతీతంగా పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లను పంపిణీ చేశారు. గరికపాటి పుల్లయ్య, చందుశివ, కొండపల్లి వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి కోడూరు :** కోడూరు ప్రధాన సెంటర్ లోని రంగా విగ్రహానికి జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పరిసే మాధవ రావు, కొండవీటి వెంకట నారాయణరావు పూలమాల వేసి నివాళుర్పించారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :**బంటుమిల్లి వైస్సార్సీపీ నాయకులు సుజ్ఞానం మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. నియోజకవర్గం పెడన నియోజకవర్గం చైర్మన్ పట్టపు నాని, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బొమ్మిడి నాగార్జున, బంటుమిల్లి సర్పంచ్ సుజ్ఞానం, సతీష్, వైస్ ప్రెసిడెంట్ నవీన్ పాల్గొన్నారు. అలాగే బంటుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపు రెడ్డి వీరబాబు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి బోల్లా వెంకన్న పాల్గొన్నారు **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నంలో సోమవారం మాజీ మంత్రి పేర్నినాని తనయుడు, యువ నాయకులు పేర్ని కష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో మోహన రంగాకు నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. మేయర్ మోకా వేంకటేశ్వరమ్మ,లంకా సూరిబాబు, చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జీ పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇన్చార్జి బండి రామకష్ణ, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకిశెట్టి బాలాజీ, జనసేన పార్టీనాయకులు నిర్వహించిన కార్యక్రమాల్లో రంగ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం.రాజు, కొండ, వడ్డీచిరంజీవి, పినిశెట్టి వేణు, వాసు, కుమారి,మీరా సుదర్శన్, గుణంవాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-** **పమిడిముక్కల :** స్వర్గీయ వంగవీటి మోహన రంగా పేద ప్రజల కోసం చేసిన కార్యక్రమాలు మరువలేని అని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సోమవారం పమిడిముక్కల మండలంలోని మంటాడ సెంటర్‌లో మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పిటిసి ఏనుగు వెంకటరమణ కుమారి, తాడింకి గ్రామ సర్పంచ్ జంపాల ధనలక్ష్మి ,రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు, మంటాడ ఎంపిటీసీ మేరుగ లక్ష్మి, మర్రి దుర్గారావు, వైసిపి మండల అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచే వ్యక్తి వింఎం రంగా : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి

రాష్ట్ర ప్రజల గుండెల్లో ఎప్పుడూ నిలిచిపోయే వ్యక్తి వి.ఎం.రంగా అని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. సోమవారం స్థానిక శరత్‌థియేటర్‌లో వంగవీటి మోహన్‌రంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని, మాట్లాడుతూ ఏపార్టీ నాయకులు హత్యకు కారకుల య్యారో ఆనాయకులే రంగా కాళ్ళవద్దకు వచ్చి నివాళు లు అర్పించటం హర్షించదగ్గ విషయమన్నారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా తన సోదరసమానులన్నారు. రంగా హత్య కేసులో ఉన్న ఏ ఒక్కరూ వైసీపీలో లేరన్నారు. టిడిపి ప్రభుత్వం, అప్పటి ఎమ్మెల్యేలు కలిసి వ్యవస్థగా ఏర్పడి రంగాను కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను. పాలేటి చంటి, తోట శివాజీ, అంజనేయప్రసాద్, మాదాసు వెంకటలక్ష్మీ, వెంపటి సైమన్ పాల్గొన్నారు.

నష్టపరిహారం క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : బాపులపాడు మండలం, మల్లవల్లి గ్రామ పరిధిలో సర్వే నెం.11లో ఏ పి ఐ సి సి కి కేటాయించిన భూములలో ఆక్రమణలో ఉండి నష్టపరిహారం పొందని వారు తమ క్లెయిమ్లను గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి వారికి 15 రోజుల్లోగా అర్జీ దాఖలు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మెజిస్ట్రేట్, డా. అపరాజిత సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జాయింట్ కలెక్టర్, డిఆర్వో, ఆర్డీఓ లతో ఒక కమిటీని జిల్లా కలెక్టర్ నియమించారు. ఈ కమిటీ తగు పరిశీలన జరిపి క్లెయిమ్ల అర్హత నిర్ణయిస్తుందని, ఆమేరకు అర్హులైన వారికి నష్టపరిహారం మంజూరు చేస్తారన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన సరైన ఆధారాలతో సంబంధిత డాక్యుమెంట్లతో క్లెయిమ్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తోట వెంకయ్య

పేదలకు 'తోట' చేయూత

ప్రజాశక్తి-గన్నవరం : పేద వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన స్ఫూర్తి ప్రదాత వంగవీటి మోహన రంగా అని వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని సావరగూడెం గ్రామంలో ఆయన వందమంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ మోహనరంగా విగ్రహానికి స్థానిక సెంటర్లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోట మాట్లాడుతూ రంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని వర్గాలకు విశేషమైన సేవలు అందించాలని అందుకే ఆయన అసువులు బాసి మూడు దశాబ్దాలు దాటిన వన్నెతెరగని నాయకుడిగా రాష్ట్ర మొత్తం ఆయన సేవలను నిరంతరం కీర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు, తిరుమల శెట్టి సత్యనారాయణ, చిమట కోటేశ్వరరావు, పెద్దపాటి నాగేశ్వరరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, పాలడుగు శ్రీమన్నారాయణ, మిర్యాల శ్రీనివాసరావు, మారెళ్ళ నిర్మలాంబ, మేడిశెట్టి సూర్యవతి, అంగజాల వెంకటయ్యమ్మ తదితరులు పెద్దలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయపేట

మండలంలోని తిరుమలగిరి గ్రామములో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్తానం జరుగుచున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ వాస్తవ్యులు సుంకర శ్రీనివాసరెడ్డి వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు వెంకటేశ్వరరెడ్డి, మాణిక్యమ్మ ల జ్ఞాపకార్ధం రూ 1,00,116లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి డి రామవప్రసాద్ స్వామివారి తీర్ధ ప్రసాదాలు శేషవస్త్రములు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పసుపులేటి రాధాసుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి అరుణ్ కుమార్

థెరీసమ్మకు ఎంఎల్‌సి నివాళి

ప్రజాశక్తి-నందిగామ

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాతృమూర్తి ఆదిమూలపు థెరీసమ్మ(85) అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని ఎస్‌జిఐటి కళాశాల ఆవరణలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ఆమె పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందకష్ణ మాదిగ, కొమ్మూరి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ వేడుకలు

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ మండలం అంబారుపేట బోదానంధ ఆశ్రమం పీఠాధిపతి రామకష్ణ స్వామిజీ సంస్మరణ వేడుకలు సోమవారం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆశ్రమం కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్‌బికెను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి-బంటుమిల్లి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాలతో బంటుమిల్లి మండలం మల్లేశ్వరం మార్కెట్ యార్డ్‌లోని రైతు భరోసా కేంద్రాన్ని బంటుమిల్లి ఎంపీపీ చినబాబు సందర్శించారు. రైతులకు సంబంధించిన పలు సమస్యలబీళి ఆర్ బి కే సిబ్బందితో, మార్కెట్ యార్డ్ సిబ్బందితో చర్చించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇచ్చిన సూచనలను రైతులకు అర్థమయ్యే విధంగా రైతులకి అవగాహన కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి అలసత్యం వహించకుండా అందరూ కూడా రైతులకు మేలు చేసే విధంగా సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ కోరారు.

అన్న క్యాంటీన్లో అన్నదానం

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో నడుస్తున్న అన్నా క్యాంటీన్ సోమవారంతో 150వ రోజు పూర్తి చేసుకుంది. జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో వివిధ గ్రామాల నుండి ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాల విద్యార్థులు, అన్న క్యాంటీన్లో 650 మంది భోజనం చేశారని నిర్వాహకులు తెలిపారు. నకిరికంటి పాండురంగారావు, లక్ష్మీ ఈశ్వరి ల కుమారుడైన నకిరేకంటి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా వారి భార్య సుజాత, కుమార్తె బిందుప్రీతి, మనవడు రంగసాయి సోహన్ అభినందనలతో అన్న క్యాంటీన్లో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పేరం సైదేశ్వర రావు, గుంజ నరసయ్య, కేళి నాగేశ్వరరావు, కొర్రకూటి సైదులు, షేక్ షరీఫ్, షేక్ అక్బర్, జై రెడ్డి, సుధాకర్, వెంకయ్య, శ్రీను మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో క్షయ వ్యాధి నివారణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చునని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి టి.బి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిర ఆవరణలో క్షయ వ్యాధి గ్రస్తులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్‌లు పౌష్టికాహార కిట్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధి నివారించడంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంధ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు పౌష్టికాహారాన్ని అందించి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చి దిద్దెందుకు కషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశామన్నారు. క్షయ వ్యాధికి సంబంధించిన లక్షణాలు అందరిలోనూ అంతర్గతంగా ఉంటాయని ఐతే అనారోగ్యంతో రోగ నిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారిలో క్షయ వ్యాధికి సంభందించిన బాక్టీరియా వద్ధితో లక్షణాలు బయటపడతాయన్నారు. క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచవచ్చునన్నారు. జిల్లాలో రెండువేల మంది వరకు క్షయ వ్యాధి బాధితులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ నివేదికలు తెలుపుతున్నాయని వారందరికీ పౌష్టికాహారాన్ని, మందులను అందించడం ద్వారా క్షయ వ్యాధిని నియంత్రించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. అధికారులు కూడా క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందించడం లో ఆర్థికంగా చేయూతనందించడం శుభపరిణామమని, ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నియంత్రణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు పిలుపునిచ్చారు. పౌష్టికాహార పంపిణి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.యం.సుహసిని, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. జె.ఉషారాణి, టి.బి.యూనిట్ పర్యవేక్షకులు ఉన్నారు

హై రిస్క్ గర్భిణీ స్త్రీల రిఫెరల్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

మాతాశిశుమరణాలపై దృష్టి సారించాలి : కలెక్టర్

మాతాశిశు మరణాలు నమోదు కాని జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హైరిస్క్ గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మాతాశిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో మాతృ మరణాల నివారణలో భాగంగా రూపొందించిన హై రిస్క్ గర్భిణీ స్త్రీల రిఫెరల్ పుస్తకాలను కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డిప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలను నివారించేందుకు గర్భిణీలో ప్రమాద లక్షణాలు ఎక్కువ కలవారిని (హై రిస్క్) ముందుగా గుర్తించి వారిని ప్రసవానికి ముందుగానే దగ్గరలో వున్న మాతా శిశు నిపుణులు కలిగిన ఆసుపత్రులుకు తరలించే పక్రియలోభాగంగా హైరిస్క్ గర్భిణీ తరలింపు రిజిస్టర్లు ఉపయోగపడతాయన్నారు. మాతా శిశు సంరక్షణ లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, మాత మరణాలు సంభవించని జిల్లాగా ఉండేలా కషి చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణీ లను ముందుగానే గుర్తించి తగిన కార్యాచరణ ద్వారా సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తద్వారా తల్లి బిడ్డ ఆరోగ్య సంరక్షణకు దోహద పడవచ్చునని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో మరణాల నివారణకు ముందస్తు ప్రణాళికతో హై రిస్క్ గర్భిణీస్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ జె. సునీత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా.యం.సుహసిని, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జె.ఉషారాణి, లక్ష్మి కుమారి ఉన్నారు.

జాతీయ పోటీలకు ఎన్ఆర్ విద్యార్థుల ఎంపిక

విజయవాడ: ఎన్ఆర్ స్కూలు విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే అండర్-14 రోల్‌బాల్ సబ్ జూనియర్ నేషనల్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ ప్రిన్సిపల్ ఆర్ఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు కోచ్ ప్రసాద్ అభినందించారు.

ఇంటర్నేషనల్ వ్యాక్సినేషన్ సెంటర్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న అంతర్జాతీయ వ్యాక్సినేషన్ సెంటర్(ఐవిసి)లో సోమవారం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలియచేశారు. మొదట ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్‌తో ప్రారంభించి అన్ని పనిదినాలలో ప్రతిరోజూ వ్యాక్సినేషన్ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. పర్యాటకులందరూ వారి పాస్ పోర్టులను ఇమెయిల్ చేసి వ్యాక్సినేషన్ కోసం అపాయింట్మెంట్ పొందవచ్చని తెలిపారు. ఒక వ్యక్తికి వ్యాక్సినేషన్ ఫీజు కింద నామమాత్రపు రుసుము రూ.500 వసూలు చేస్తారనీ, ఈ మొత్తాన్ని హెచ్‌డిఎఫ్సి బ్యాంక్ ఖాతా నెంబరు 99991234566999 ద్వారా చెల్లించాల్సి వుంటుందని వివరించారు. ఒకే రోజు కనీసంగా ఇద్దరు వ్యక్తులు అప్పాయింట్మెంట్ పొందవచ్చుననీ, ఇద్దరు వంతున అధికసంఖ్యలో కూడా అప్పాయింట్‌మెంట్‌ను పొందేందుకు అనుమతిస్తారనీ ఆమె పేర్కొన్నారు. అవసరమైన సహాయం కోసం వారు వాట్సప్ నెంబరు 8978633599కు సంప్రదించవచ్చని డాక్టర్ సౌభాగ్యలక్ష్మి ఈ ప్రకటనలో వివరించారు.

అర్హులందరికీ పథకాలు అందేలా కృషి : వెలంపల్లి

ప్రజాశక్తి-భవానీపురం

అర్హులైనవారందారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 43వ డివిజన్‌లోని 140వ సచివాలయం పరిధిలో 152వ రోజు సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయా ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ జగనన్న వచ్చాక ప్రతి ఒక్కరికీ ఇంటిపట్టాలు ఇచ్చామన్నారు. అందరికీ అన్నీ సంక్షేమ పథకాలు ఇస్తున్నామన్నారు. డివిజన్ అభివద్ధికి కట్టుబడి వున్నామని హామీ ఇచ్చారు. ప్రతి పథకాన్ని నేరుగా వారి ఇంటికి ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ,43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో పసికందు

ఆలస్యంగా వెలుగులో ఘటన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండంల పరిధిలోని (కాచవరం) దొనబండ వద్ద ఓ పసికందు ముళ్ల పొదల్లో కనిపించింది. ఈ ఘటన కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన మహమ్మద్ షాబాజ్ గుడివాడకు చెందిన దివ్య అనే యువతితో కొంతకాలంగా హైదరాబాద్‌లో సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో దివ్య గర్భవతి కాగా ఈ నెల 23వ తేదీన పురిటి నొప్పులు రావడంతో హైదరాబాద్‌లోని మోడరన్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ దివ్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే దివ్యకు మూర్ఛ రావడంతో ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దివ్య మృతిచెందింది. దివ్య మతదేహాన్ని తీసుకుని మినీ అంబులెన్స్‌లో హైదరాబాద్ నుంచి ఆమె స్వగ్రామం గుడివాడకు వస్తుండగా మార్గమధ్యలో దొనబండ వద్ద ముళ్లపొదల్లో షాబాజ్ పసికందును వదిలి వెళ్లిపోయాడు. అటుగా వెళ్తున్న గాజులు విక్రయించే మహిళ పసికందు ఏడుపు విని దగ్గరికి వెళ్లి చూసింది. పొదల్లో పసికందును గుర్తించి వెంటనే స్థానిక ఆశ వర్కర్‌కు అప్పగించింది. స్థానిక వీఆర్వో, ఆశ వర్కర్లు ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పి.శ్రీను, ఎస్సై శ్రీను సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దారుణానికి పాల్పడ్డ పసికందు తండ్రి షాబాజ్‌ను పట్టుకున్నారు. పసికందును సంరక్షణ నిమిత్తం చైల్డ్‌లైన్‌కు అప్పగించారు.

త్రోబాల్ పోటీలకు ఎస్ఎస్‌కె విద్యార్థిని

ప్రజాశక్తి-మైలవరం: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు స్థానిక ఎస్ఎస్‌కె పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం జాన్ లాజరస్ సోమవారం తెలిపారు. ఈ నెల 17, 18 తేదీలలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలికల అంతర్ జిల్లాల త్రోబాల్ పోటీలు కడప జిల్లాలో జరిగాయన్నారు. ఈ పోటీలలో ఎర్రగుంట సంహిత అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక అయిందన్నారు. ఈ సందర్భంగా సంహితతో పాటు కోచ్ వేణును పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహన్‌రావు, కరస్పాండెంట్ గొల్లపూడి భావన, రాజేష్‌బాబు అభినందించారు.

చేపల జానీకి నివాళి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో ప్రముఖ చేపల వ్యాపారి షేక్ జానీ అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతిచెందారు. గత 30 సంవత్సరాల నుంచి చేపల మార్కెట్ వద్ద ఆయన చేపల వ్యాపారం నిర్వహిస్తున్నారు. జానీ మృతదేహాన్ని టిడిపి మైనార్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు షేక్ కరిముల్లా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ కరిముల్లా, 11వ వార్డ్ ప్రెసిడెంట్ సయ్యద్ కరిముల్లా, బూత్ కన్వీనర్ సయ్యద్ రసూల్, టిడిపి సీనియర్ నాయకులు షేక్ గౌస్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పింఛన్లు రద్దు చేయొద్దని వినతి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరంలో ఫెన్షన్లు తొలగించకుండా జనవరి మాసం కూడా పంపిణీ చేయాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టరేట్‌లో, అలాగే విఎంసిలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, కమిషనర్‌కు వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో సుమారు 4,500 పెన్షన్లను రకరకాల సాకులతో తొలగించాలని అధికారులు నిర్ణయించారని అన్నారు. అయితే పొరపాట్లను సరి చేసుకోవడానికి తగిన సమయం ఇవ్వాలని కోరారు. పెన్షన్లు తొలగించకుండా జనవరి నెల కూడా పెన్షన్లు పంపిణీ చేయాలని కోరారు.

ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సేవలు విస్తృతం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను విస్తతం చేసే దిశగా చర్యలు చేపట్టామనీ ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ తెలిపారు. విజయవాడ బందరు రోడ్డులో ఫుట్‌పాత్‌లపై చలిలో వణుకుతూ పడుకునే నిరుపేదలైన వారికి చలి తీవ్రత నుంచి కాపాడేందుకు ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" విజయవాడ సిటీ కన్వీనర్ మట్టా ఏసుపాదం(నాని) ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చాట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ మా సంస్థ ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ "కి ఉన్న వనరులతో సేవా కార్యక్రమాలు విస్తతం చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దానిలో విజయవాడ సిటీ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా విజయవాడ మహానగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో తమ సంస్థ ద్వారా సేవలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ కమిటీ సభ్యులు నాగరాజు, వంశీ, సుందరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.